క్లుప్తంగా

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని డాక్టర్ సృజన సూచించారు. స్థానిక 27వ డివిజన్ 199వ సచివాలయం పరిధిలో గురువారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన పెంచుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దంతాల ఆరోగ్యం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సుదంతా వైద్యశాల డెంటిస్ట్ సీహెచ్ నారాయణరావు తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు దంతాల సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దంత సమస్యలు, దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చాక్లెట్స్, కేకులు తిన్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. చిన్నతనంలో వచ్చే పాల దంతాలను ఏ విధంగా కాపాడుకోవాలో వివరించారు. ప్రతి రోజు రెండు పూటలా బ్రష్ చేయాలని చెప్పారు. చక్కటి దంతాలతో ఆత్మ విశ్వాసం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఠాగూర్ గ్రంథాలయ అధికారి కె.రమాదేవి డెంటిస్ట్ నారాయణరావును సత్కరించారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ చాలీసా మహా పారాయణం

విజయవాడకల్చరల్: జయహో భారతీయం ఆధ్వర్యంలో హనుమత్ జయంతి సందర్భంగా శనివారం హనుమాన్‌చాలీసా మహా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో సాయంత్రం 5 గంటలకు మహా పారాయణం జరుగుతుందని, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి, ఆధ్యాత్మికవేత్త ఎంఎస్ శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. లక్ష నాగవల్లి పత్రాలతో హనుమత్ ఆరాధన జరుగుతుందని చెప్పారు.

మాలకొండయ్య మృతి పార్టీకి తీరని లోటు



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తెనాలి మాలకొండయ్య(71)మృతి పార్టీకి తీరని లోటని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ దేవినేని గాంధీపురానికి చెందిన మాలకొండయ్య అనారోగ్య సమస్యలతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే విష్ణు మాలకొండయ్య మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విష్ణు పరామర్శించారు. స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, పార్టీ రాష్ట్ర నాయకుడు ఉమ్మడి వెంకట్రావ్, డివిజన్ కో ఆర్డినేటర్ నాలం బాబు, ఆర్ఎస్ నాయుడు, దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

బంగారు గొలుసు చోరీ

ఉంగుటూరు: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన ఉంగుటూరులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు సచివాలయం సమీపంలో సంబంగి కృష్ణవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. సుమారు 7 కాసుల బంగారు గొలుసును వృద్ధురాలు తన మంచం పరుపు కింద పెట్టుకుంది. గురువారం మధ్యాహ్నం గుడివాడలోని తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో గొలుసు వేసుకుందామని చూస్తే కనిపించలేదు. దీంతో ఆమె ఉంగుటూరు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవి చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో నమూనాలను సేకరించారు.

మొగల్రాజపురంలో డయేరియా కట్టడి

- గురువారం ఒక్క కొత్త కేసు కూడా రాలేదు
- కొనసాగుతున్న వైద్య శిబిరం, ఇంటింటి సర్వే
- నీరసం ఉన్న వారికి సెలైన్‌ను ఎక్కిస్తున్న వైనం
- పైప్‌లైన్‌లపై కార్పొరేషన్ సిబ్బంది దృష్టి
- వైద్య సిబ్బంది సేవలు భేష్ అంటున్న స్థానికులు





మొగల్రాజపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు ; ఆరు పడకలతో ఏర్పాటు చేసిన వార్డులో రోగికి సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొగల్రాజపురంలో డయేరియాను పూర్తిగా కట్టడి చేశారు. ఆ ప్రాంతంలో గురువారం ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాలేదు. రెండు రోజుల కిందట సోకిన వారే శిబిరానికి వస్తుండగా, వారికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడంతో పాటు, అవసరమైన వారికి సెలైన్ ఎక్కిస్తున్నారు. ఇలా గురువారం ఇద్దరికి సెలైన్ ఎక్కించారు. ఆ ప్రాంతంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే కొనసాగుతుంది. సుమారు వంద మంది వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. కొత్తగా డయేరియా బారిన పడిన వారు ఎవరూ లేరని సర్వేలో తేల్చారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం..

మొగల్రాజపురం బందెల దొడ్డి సెంటర్‌లో తాత్కాలికంగా ఆరు పడకలతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం కొనసాగుతుంది. షిఫ్ట్‌కు ముగ్గురు వైద్యుల చొప్పున 24 గంటలూ శిబిరం నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చినప్పటికీ, శిబిరానికి పాత రోగులు వస్తుండటంతో శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు రోగులను పరీక్షించి నీరసంగా ఉన్న వారికి సెలైన్ ఎక్కిస్తున్నారు. అంతేకాకుండా ఎపిడమిక్, సర్వే బృందాలు కూడా ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. ఏ ఇంట్లోనైనా డయేరియాతో బాధపడుతున్న వారు ఉన్నారేమో గుర్తిస్తున్నారు. అంతేకాకుండా కాచి చల్లార్చిన నీటినే తాగాలని, విరోచనాలు అయితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు.

పైప్‌లైన్ల మార్పు...

నాలుగు రోజులుగా ఆ ప్రాంతంలో నగర పాలక సంస్థ సిబ్బంది మంచినీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్నారు. ఏదైనా ప్రాంతంలో దెబ్బతిన్నట్లు అనుమానం వస్తే వాటిని వెంటనే మార్పు చేస్తున్నారు. శానిటేషన్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా మొబైల్ రీజినల్ ల్యాబ్‌ను అక్కడే ఉంచి నిత్యం పలు ప్రాంతాల్లో శాంపిల్స్‌సేకరించి పరీక్ష చేస్తున్నారు. కాగా బుధ, గురువారాల్లో సేకరించిన శాంపిల్స్ అన్నీ నెగటివ్ వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది.



శిబిరంలో వైద్యులు



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

వైద్యశాఖ సేవలు భేష్..

మొగల్రాజపురం ప్రాంతంలో ఒకరిద్దరికి డయేరియా సోకినట్లు తెలిసిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వెంటనే ఆ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతోపాటు, ఇంటింటి సర్వే చేసి బాధితులను గుర్తించడం, మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆస్పత్రులకు తరలించడం వంటి చర్యలు వేగంగా చేపట్టారు. దీంతో ఏ ఒక్కరికీ పరిస్థితి విషమించకుండా చూడగలిగారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పర్యవేక్షణలో 20 మందికి పైగా వైద్యులు, 100 మంది సిబ్బంది, ఎపిడమిక్ బృందాలు, వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగ ప్రొఫెసర్‌లు ఇలా అందరూ ఆ ప్రాంతంపై దృష్టి పెట్టడంతో వెంటనే అదుపు చేయగలిగినట్లు స్థానికులు చెపుతున్నారు.

శిబిరాన్ని కొనసాగిస్తాం



మొగల్రాజపురం ప్రాంతంలో గురువారం ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాలేదు. గతంలో శిబిరానికి వచ్చిన వారే నీరసంతో రావడంతో ఇద్దరికి సెలైన్ ఎక్కించాం. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది. అయినప్పటికీ తమ సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒక్క రోగి కూడా రానంత వరకూ శిబిరం కొనసాగిస్తాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్ జిల్లా

అధికారులు వెంటనే స్పందించారు



మా డివిజన్‌లో కొందరికి విరోచనాలు అవుతున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే నగర పాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించారు. మంచినీటి సరఫరాను నిలిపివేసి ట్యాంకర్లతో సరఫరా చేయడంతో పాటు, ట్యాంకును శుభ్రం చేశారు. వైద్యశాఖ అత్యవసరంగా శిబిరం ఏర్పాటు చేసి , బాధితులకు వైద్యం అందించారు. ఎవరికీ పరిస్థితి విషమించకుండా డీఎంహెచ్ఓతో పాటు, వైద్యులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివచ్చి మా ప్రాంత ప్రజలకు సేవలు అందించారు.

–మెరకనపల్లి మాధురి, కార్పొరేటర్

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 123 మంది హాజరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 123 మంది హాజరయ్యారు. 49,001 నుంచి 54,000 ర్యాంకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సెలింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. శుక్రవారం 59,001 నుంచి 67,000 వరకు ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం సాయంత్రం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గోవర్ధనం వెంకటేశ్వరాచార్య, గోవర్ధనం శోభనాద్రీ చార్యులు శ్రీవిష్వక్సేన పూజ, అంకురార్పణ పుణ్యాహవచనం, దీక్షా వస్త్ర సమర్పణ జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తికి విశేషంగా మన్యుసూక్త పారాయణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కనపర్తి కొండలరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

సీఎం వైఎస్ జగన్ పాలన సువర్ణయుగం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని 2019–2024 మధ్య అందించిన పాలన రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. చారిత్రాత్మక విజయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఆయన ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని పాదయాత్రలో కలలుకన్నట్లుగానే.. అధికారంలోకి రాగానే వాటన్నింటి సాకారం దిశగా అడుగులు వేసి విజయం సాధించారన్నారు. 99.4 శాతం హామీలను అమలుపరిచి.. మేనిఫెస్టోకు సరి కొత్త అర్థాన్ని ఇచ్చారని చెప్పారు. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి మరీ.. చెప్పిన తేదీకే లబ్ధిదారుల ఖాతాలలో నగదును నేరుగా జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

కరోనా కష్టకాలంలో నేనున్నానంటూ అన్ని వర్గాల ప్రజలకు భరోసాకల్పించారన్నారు. ఇవాళ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి నేతలంతా కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు.

విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్

చిన్న వయస్సులోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలను చూసి.. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. ప్రజల ఇంటి వద్దకే పాలనను చేరువ చేస్తూ.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ ఐదేళ్లలో డీబీటీ ద్వారా అక్షరాల రూ.1,89,519 కోట్ల లబ్ధి ఆడపడుచులకు చేకూర్చగా.. సెంట్రల్ పరిధిలో రూ.402.46 కోట్ల సంక్షేమాన్ని అందజేశామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను 1,059 నుంచి 3,257 కి పెంచడంతో పాటు.. ఉచిత వైద్య పరిమితిని రూ. 25 లక్షలకు పెంచి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఈ ప్రభుత్వం వచ్చాక 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టగా.. బాబు హయాంలో ఒక్క మెడికల్ కాలేజీనైనా ప్రారంభించారా..? సమాధానం చెప్పాలన్నారు. సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ శాతం పెరిగిందని.. వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకువచ్చారన్నారు. ప్రజలందరి చల్లని దీవెనలతో మరోసారి జగనన్న ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు.

వాటర్ ట్యాంకుల్లో ప్రతి రోజూ క్లోరినేషన్

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం, ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాలేదని నీటి సరఫరా విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీ సింధూర తెలియజేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం పాయకాపురంలోని ప్రజాశక్తినగర్, రాధానగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా అవుతున్న నీటి నుంచి కొన్ని శాంపిల్స్‌ను ఆయా ప్రాంత ప్రజల సమక్షంలోనే తీశారు. శాంపిల్స్ పరీక్షించి, ఎలాంటి పొల్యూషన్ లేదని ఆర్సీ రిపోర్ట్‌ను చూపించారు. ప్రతి రోజూ తాగునీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ కలిపి తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నామన్నారు. తాగునీరు సరఫరా చేయని సమయాల్లో నీటి కోసం మోటార్లు వేస్తే రంగుమారిన నీరు రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. నీరు వచ్చే సమయాల్లో మాత్రమే నీటి కోసం మోటార్లు ఉపయోగించుకోవాలని డీఈ సూచించారు. ఇదే సందర్భంలో పలువురు తమ ఇంటి వద్ద నీరు చెక్ చేయాలని కోరగా అన్ని చోట్ల చెక్ చేసి ప్రజల అనుమానాలను నివృత్తి చేశారు. పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో మొత్తం 14 తాగునీటి సరఫరా చేసే ట్యాంక్‌లున్నాయని, వాటిని ప్రతి రోజూ క్లోరినేషన్ చేస్తామన్నారు. ప్రజల ఎలాంటి అనుమానాలకు తావులేకుండా తాగు నీరు తాగవచ్చునన్నారు. తనిఖీల్లో సహాయ మెడికల్ అధికారి రామకోటేశ్వరరావు, నీటి సరఫరా విభాగం ఏఈ అరుణకుమార్ తదితరులు ఉన్నారు.



ప్రజాశక్తి నగర్‌లో వాటర్ శాంపిల్స్ చూపుతున్న అధికారులు

బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబాకు విశేషంగా మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించారు. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి విశేషంగా హారతులిచ్చారు. అలాగే శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబావారి పారాయణం జరిగింది. మధ్యాహ్నం దాతల సహకారంతో 500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



విజయవాడకల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ సుశీల్‌కుమార్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత కృష్ణ 81 వ జయంతి వేడుకలను గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు, గాయకుడు సుశీల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో కృష్ణ యుగం స్వర్ణయుగమని అభివర్ణించారు. కృష్ణ పేరుతో ప్రభుత్వం ప్రతి ఏటా అవార్డు ప్రకటించాలని ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ఆదిరాల జయప్రభు, జోషి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

హనుమజ్జయంతి వేడుకలకు ఆలయాల ముస్తాబు



ముత్యాలంపాడులోని ఆంజనేయస్వామివారి విగ్రహం



మధురానగర్‌లోని శ్రీ కల్యాణ రామాలయం



దాసాంజనేయస్వామివారి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల ఒకటో తేదీ శనివారం హనుమజ్జయంతి వేడుకలకు నగరంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. స్వయం భూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం, ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం, మధురానగర్ శ్రీ కల్యాణ రామాలయం, పప్పులమిల్లు సెంటర్‌లోని శ్రీ బాల ఆంజనేయస్వామివారి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠం, రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే మందిరాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. అలాగే ఒకటో తేదీన హనుమజ్జయంతి పురస్కరించుకుని స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని ఆమె పేర్కొన్నారు.

చిరస్మరణీయులు సీహెచ్ శ్రీనివాసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు దివంగత చిరుతోటి శ్రీనివాసులు చిరస్మరణీయులని పలువురు వక్తలు అన్నారు. శ్రీనివాసులు ద్వితీయ వర్ధంతి కార్యక్రమం 32వ డివిజన్ శాంతినగర్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద గురువారం ఉదయం జరిగింది. సీపీఐ డివిజన్ కార్యదర్శి డి.బి.కె.రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసులు చిత్రపటానికి సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ సీహెచ్ శ్రీనివాసులు పార్టీకి, డివిజన్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. డివిజన్‌లో ఏ సమస్య వచ్చినా ప్రజలు ముందుగా శ్రీనివాసులు వద్దకు వచ్చి చెప్పుకునేవారని, ఇది ఆయన పోరాట పటిమకు, సమస్యల పరిష్కారంలో ఆయన చూపే చొరవకు నిదర్శనమన్నారు. డివిజన్‌లో నెలకొన్న ఎన్నో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. శ్రీనివాసులును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజరాజేశ్వరపేటలోని అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు లంకా దుర్గారావు, ఎం. సాంబయ్య, పేరయ్య, సీహెచ్ సత్యనారాయణ, కంచర్ల నాగేశ్వరరావు, చిరుతోటి శ్రీధర్, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీనివాసులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిప్పుల కొలిమి !

విజయవాడ నగరం గురువారం నిప్పుల కొలిమిలా మారింది. ప్రచండ భానుడి ప్రభావానికి జనం విలవిల్లాడిపోయారు. ఉదయం నుంచే ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నానికి వాతావరణం నిప్పుల కుంపటిలా మారింది. ఒక పక్క వేడి గాలులు, మరో పక్క సుర్రుమంటున్న సూరీడుతో జనం బెంబేలెత్తారు. పాదచారులు, వాహనదారులు, బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వాళ్లు ఎండ దెబ్బకు అల్లాడిపోయారు. మొహాలు పూర్తిగా కప్పేసుకొని మహిళలు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించారు. సాయంత్రం ఏడు గంటలు దాటినా వడగాడ్పుల తీవ్రత తగ్గలేదు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు అవస్థలు పడ్డారు. ఏసీలు, కూలర్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









దక్షిణామూర్తికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తి విగ్రహానికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూజలు చేశారు.